ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి : కలెక్టర్

జగిత్యాల, నవంబర్ 25: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అధికారులు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను అదనపు కలెక్టర్లు బీఎస్ లత, గౌతమ్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణికి మొత్తం 35ఫిర్యాదులు రాగా, వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, ఎన్ శ్రీనివాస్, జివాకర్, కలెక్టరేట్ ఏవో హన్మంతరావు, డీఆర్డీఏ రఘువరణ్, ఆయా శాఖల అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి.. అనంతలోకాలకు..

- నీటితొట్టెలో పడి మూడేండ్ల బాలుడిమృతి
- మోత్కురావుపేటలో విషాదం

రియాన్స్ (ఫైల్)

మేడిపల్లి, నవంబర్ 25: అప్పటివరకు ఇంటిముందు అల్లారుముద్దుగా ఆడుకుంటున్న ఆ చిన్నారి.. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న నీటి తొట్టెలో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన భీమారం మండలం మోత్కురావుపేటలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కురావుపేటకు చెందిన బైకం రాకేశ్-జల దంపతులకు ఇద్దరు కొడుకులు. చిన్నకొడుకు రియాన్స్(3) రోజువారీ మాదిరిగా ఆదివారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పక్కనే గల నీటి తొట్టెలో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

ఆర్టీసీ బస్సు గూడ్స్ వ్యాన్ ఢీ : పలువురికి గాయాలు

కోరుట్ల రూరల్, నవంబర్ 25: మోహన్ రావుపేట జాతీయ రహదారి, బస్‌స్టేషన్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు, గూడ్స్ వ్యాన్ ఢీకొనడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మోహన్‌రావుపేట స్టేజీ వద్ద నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, గూడ్స్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొనగా, బస్సులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. గూడ్స్ వాహన డ్రైవర్‌కు గాయాలు కావడంతో 108 సాయంతో జగిత్యాల ఏరియా దవాఖానకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆర్టీసీ బస్సు, గూడ్స్ వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కరాటే పోటీల్లో కోరుట్ల విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, నవంబర్ 25 : పట్టణానికి చెందిన ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చూపి, 15 పతకాలను కైవసం చేసుకున్నారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో మూడు రోజుల పాటు కాంటినెంటల్ షోటోకన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్ షిప్, సినీ హీరో కృష్ణంరాజు మెమోరీయల్ కప్-2024 కరాటే పోటీల్లో కటా, కుమ్మితే విభాగంలో ఒకినావా స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు కోచ్ రమేశ్ సోమవారం తెలిపారు. కాగా, విద్యార్థులకు టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీనివాస్, తెలంగాణ కరాటే చీఫ్ వసంత్ కుమార్ చేతుల మీదుగా పతకాలను అందజేశారు. విద్యార్థులను పలువురు క్రీడాకారులు అభినందించారు.

కరాటే విద్యార్థులకు బెల్టులు అందజేత ..

మారుతీనగర్, నవంబర్ 25 : మెట్‌పల్లి పట్టణంలోని క్లబ్‌లో సోమవారం 50 మంది కరాటే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ ట్రెజరర్ మాస్టర్ సంతోష్‌కుమార్ వివిధ విభాగాల్లో కలర్ బెల్ట్‌లతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ కార్యదర్శి రాంబాబు, మెట్‌పల్లి తైక్వాండో క్లబ్ సభ్యులు రమేశ్, మాస్టర్ ఎనుగందుల అజయ్, యాసిన్, రాజేందర్, శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, నవంబర్ 25 : ఇబ్రహీంపట్నం ఆదర్శపాఠశాలలో గంటల ప్రతిపాదికన తెలుగు బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్న పాఠశాల ఇల్లెందుల ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగులో పోస్ట్ గ్రాడ్యుయేట్, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 27న దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నాలాల రక్షణకు ప్రత్యేక చర్యలు

- ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల
- మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

మెట్‌పల్లి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల

మెట్‌పల్లి, నవంబర్ 25 : మున్సిపల్ పరిధిలోని నాలాలు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుట్ల శాసనసభ్యుడు కల్వకుంట్ల సంజయ్ సూచించారు. సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ రాణవేని సుజాత ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ నాలాలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. పలు వీధుల్లో విద్యుత్ దీపాలు వెలగడం లేదని, మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా సమావేశంలో వివిధ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపు తదితర వాటికి సంబంధించి 13 అంశాలతో కూడిన ఏజెండాను ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులందరు చేతులెత్తి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కమిషనర్ మోహన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి కృషి

మల్లాపూర్, నవంబర్ 25 : నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామాల్లోని ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల అన్నారు. సోమవారం మండలంలోని వేంపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శివాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ డైరెక్టర్ కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులను కేటాయించారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఆధ్యాత్మిక భావనతో ఆలయాల నిర్మాణాలకు కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కదుర్క నర్సయ్య, కమిటీ సభ్యులు తిరుపతి, రాజరెడ్డి, గంగారెడ్డి, గంగాధర్, శేఖర్, నాయకులు బిట్ల నరేశ్, మచ్చర్ల శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

గోదారమ్మకు ఘనంగా హారతి

వెల్గటూర్‌లో..

ధర్మపురి : గోదావరికి హారతినిస్తున్న భక్తులు

ధర్మపురి, నవంబర్ 25 : ధర్మపురి క్షేత్రంలో గోదావరిమాతకు హారతి కార్యక్రమం సోమనివారం వైభవంగా జరిగింది. ముందుగా లక్ష్మీనర్సింహ స్వామివారి దేవస్థానం నుంచి మేళతాళాల మధ్య గోదావరి నది వరకు వేద పండితులు, అర్చకులు, భక్తులు శోభాయాత్రగా చేరుకున్నారు. గోదావరి పుష్కరఘాట్‌పై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై గోదావరి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు భక్తులతో కలిసి గోదావరినదికి హారతిపట్టారు. అనంతరం మహిళలు నదిలో కార్తీక దీపాలను వదిలారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఏ శ్రీనివాస్, అర్చకులు నంబి శ్రీనివాసాచార్యులు, శారదా మహిళా మండలి సభ్యులు, వాసవీ మహిళా మండలి సభ్యులు, తిరుమల సేవాగ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

వెల్గటూర్, నవంబర్ 25 : కార్తీక మాసం చివరి సోమవారాన్ని పురస్కరించుకొని కోటిలింగాల వద్ద గోదావరి మాతకు మహా హారతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్యకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో కాంతరెడ్డి, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రావణి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు తిరుపతి, దీప్‌చంద్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి కొప్పుల పరామర్శ

నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల

వెల్గటూర్, నవంబర్ 25 : వెల్గటూర్, ఎండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మండలంలోని స్తాంభంపల్లి మాజీ ఉప సర్పంచ్ జక్కుల మహేందర్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పాషిగామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏ వెంకన్న తండ్రి, ఎండపల్లి మండలంలోని అంబారిపేటకు చెందిన అరెళ్లి విఘ్నేష్ మృతి చెందారు. కాగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చల్లూరి రాంచందర్ గౌడ్, సింహాచలం జగన్, నాయకులు పోడేటి రవిగౌడ్, కొప్పుల సురేశ్, జుపాక కుమార్, రంగు తిరుపతి, ఎండీ రియాజ్, సనిల్, ఇప్పల రాజ్‌కుమార్, దుర్గం కృష్ణ, మల్లేశ్ ఉన్నారు.

కోదండ రామాలయ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల

మారుతీనగర్, నవంబర్ 25 : మెట్‌పల్లి కోదండ రామాలయ అధ్యక్షుడిగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఎన్నికయ్యారు. మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీలోని కోదండ రామాలయ నూతన ఆలయ కార్యవర్గాన్ని సోమవారం ఎస్సారెస్పీ ఈఈ నారాయణ రెడ్డి ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక ఆహ్వానితులుగా, ఉపాధ్యక్షులుగా ఎస్సారెస్పీ డీఈ అరుణ్‌కుమార్, జెట్టి లింగం, సాంబారి ప్రభాకర్, ఆర్మూర్ పోచయ్య, ప్రధాన కార్యదర్శులుగా అమరేందర్‌రెడ్డి, పూదరి సుధాకర్‌గౌడ్, నర్సయ్య, తిరుమలకుమార్, వెంకటేశ్, చాడ చందు, ఉపకార్యదర్శులుగా ఆరుగురు, ముఖ్య సలహాదారులుగా నలుగురితో పాటు వివిధ కార్యవిభాగాలకు సభ్యులతో కూడిన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆలయాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, రాజకీయాలకు అతీతంగా ఆలయాభివృద్ధికి కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. వారి ఎన్నికపై పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

కమనీయం.. గంగామాత కల్యాణం

మొక్కులు చెల్లించుకున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి రూరల్, నవంబర్ 25 : మండలంలోని జగ్గసాగర్‌లో సోమవారం గంగామాత కల్యాణం కనుల పండువలా జరిగింది. ఆలయంలో అభిషేకం, నిత్య హోమం, పూర్ణాహుతి, బలిహరణం తదితర పూజలు చేశారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరై గంగామాతకు ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణం తిలకించి, మొక్కులు చెల్లించుకున్నారు. గంగపుత్ర సంఘం, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

మారుతీనగర్/కోరుట్ల, నవంబర్ 25: పట్టణంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని రుద్రాభిషేకం, దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో దీపాలు వెలిగించారు. ఆలయ అధికారి విక్రమ్ పాల్గొన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని ఓంకారేశ్వరాలయంలో, ఆరపేట శివాలయాల్లో భక్తులు శివలింగాలకు పంచామృతాభిషేకాలు చేశారు. ఆరపేటలోని శివాలయంలో భక్తులు గోమాతకు పూజలు చేశారు.

పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలి

జగిత్యాల, నవంబర్ 25: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని, పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ, పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో పెన్షన్‌పై ఆదాయపు పన్ను రద్దు చేయాలన్నారు. తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో పదేళ్లుగా ప్రధానితోపాటు, కేంద్ర మంత్రికి పోస్టు కార్డుల ద్వారా వినతులు అందించామన్నారు. ఇక్కడ టీ పెన్షనర్స్ జిల్లా శాఖ కార్యదర్శి బొల్లం విజయ్, కోశాధికారి వెల్ముల ప్రకాశ్‌రావు, సహాయ అధ్యక్షుడు పీసీ హన్మంత్‌రెడ్డి, దిండిగాల విఠల్, పీ అశోక్‌రావు, సత్యనారాయణ, ఉప్పుగళ్ల మురళీధర్, ఎండీ యాకూబ్, కండ్లే గంగాధర్, సౌదరి దుబ్బేశం, పబ్బా శివానందం, రాజ్‌మోహన్ ఉన్నారు.

యాదవ సంఘం జిల్లా అడహక్ కమిటీ ఎన్నిక

రాయికల్, నవంబర్ 25 : యాదవ సంఘం జిల్లాస్థాయి సమావేశాన్ని పట్టణంలోని గుడేటి రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించి, యాదవ సంఘం అడహక్ కమిటీ జగిత్యాల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యాదవసంఘం అడహక్ కమిటీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా గనవేని మల్లేశ్ యాదవ్‌ను అడహక్ కమిటీ జిల్లా సలహాదారుడిగా తొట్ల చిన్నయ్య యాదవ్, రెబ్బాస్ మల్లయ్య యాదవ్, కొలుముల రమణయాదవ్, బల్కం మల్లేశ్ యాదవ్, దండవేణి మల్లయ్య యాదవ్, ముక్కెర శేఖర్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా మాధం వినోద్‌యాదవ్, అంకం శంకర్‌యాదవ్, కొక్కెర శేఖర్‌యాదవ్, చిర్రం ప్రకాశ్‌యాదవ్‌తో పాటు మండలాల వారీగా అడహక్ కమిటీ ఇన్‌చార్జిలను ఎన్నుకున్నారు. ఈ కమిటీ సభ్యులు వారి మండలాల్లో మిగతా యాదవులను కలుపుకొని సంఘ బలోపేతం, సభ్యత్వంపై తెలియజేసి జిల్లాలోని అన్ని గ్రామాల్లో అందరికి తెలియజేసి సభ్యత్వం చేయించాలని నిర్ణయించారు. సభ్యత్వ ఫీజు రూ. 200 నిర్ణయించారు. తొందరగా సభ్యత్వాలు పూర్తి చేసి, సభ్యత్వం తీసుకున్న సభ్యుల ఓటింగ్ ద్వారా జిల్లా మండల కమిటీని ఎన్నుకోవాలని నిర్ణయించారు.

ఇంట్లో చోరీ

కోరుట్ల, నవంబర్ 25: పట్టణంలోని ఝాన్సీరోడ్డు కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో సోమవారం దొంగతనం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని ఝాన్సీరోడ్డు కాలనీలో నివాసం ఉంటున్న కొండబత్తిని గంగాకిషన్- అరుణ దంపతులు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న తన కుమారుడు ఫణీంద్రవద్దకు ఐదు రోజుల క్రితం వెళ్లారు. సోమవారం ఇంటి తలుపులు తెరిచి ఉండడం అలికిడి లేక పోవడంతో అనుమానంతో పక్కింటివారు కుటుంబసభ్యులకు తెలిపారు. బంధువులు వచ్చి చూడగా ఇంటి గొళ్లం రంపంతో కోసి ఉంది. ఇంటిలోకి వెళ్లి చూడగా, బీరువా తెరిచి అందులోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడాన్ని గమనించి బాధితుడి బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సురేశ్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనా స్థలాన్ని పరిశీలించగా క్లూస్ టీమ్ సభ్యులు వేలిముద్ర నమూనాలు సేకరించారు. బీరువాలో ఐదు తులాల బంగారం, వెండి అభరణాలు, కొంత నగదు ఉన్నట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాలలో ఫుడ్ ఇన్‌చార్జిల సస్పెండ్

జగిత్యాల, నవంబర్ 25: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ ఇన్‌చార్జిలను సస్పెషన్ చేస్తూ కలెక్టర్ బీ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కొడిమ్యాల మండలం చెప్యాలలోని జడ్పీహెచ్ఎస్‌లో సక్రమంగా మధ్యాహ్న భోజనం అమలు చేయక పోవడంతో పాఠశాలలో ఫుడ్ ఇన్‌చార్జి వీ వెంకటరమణరావును సస్పెన్షన్ చేయగా, హెచ్ఎం వెంకటస్వామికి మెమో జారీచేశారు. అలాగే మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాల్లో నాణ్యత లేనందున ఫుడ్ ఇన్‌చార్జి సీహెచ్ కిశోర్‌ను సస్పెన్షన్ చేస్తూ, సంబంధిత ప్రిన్సిపాల్‌కు మెమో జారీచేశారు. ఎంపీపీఎస్ చెప్యాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత సరిగా లేనందున ఇన్‌చార్జి ఎం ప్రవీణ్‌కుమార్‌కు మెమో జారీ చేశారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..
యువకుడి బలవన్మరణం

రాము (ఫైల్)

కథలాపూర్, నవంబర్ 25: భార్య పుట్టింటికి వెళ్లిరావడం లేదని ఓ యువకుడు ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకుంట గ్రామానికి చెందిన అందె రాము(32)కు ఇబ్రహీంపట్నంకు చెందిన సౌందర్యతో గతేడాది వివాహమైంది. కొన్ని నెలలుగా భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదని రాము మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో చింతకుంట శివారులో సోమవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. స్థానికులు గమనించి జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు..

కోరుట్ల, నవంబర్ 25: ఖానాపూర్‌కు చెందిన రాజారెడ్డి (58) కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డులో తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. రాజారెడ్డి మద్యానికి బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపం చెందిన రాజరెడ్డి సోమవారం ఇంటిలో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజారెడ్డి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

కొడిమ్యాల, నవంబర్ 25: చెప్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి నెర్మెట్ల స్వామిపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ సత్యప్రసాద్‌కు గ్రామ మాజీ సర్పంచ్ అక్కపల్లి రాజేశం ఫిర్యాదు చేశాడు. గ్రామ పంచాయతీలో పంప్ ఆపరేటర్, ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వర్తించి ఇటీవల మృతి చెందిన తెట్టె మహిపాల్‌కు రావాల్సిన రూ.54వేల జీతం ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గ్రామస్తులు విరాళంగా అందించిన బాడీఫ్రీజర్, సౌండ్ సిస్టం కార్యాలయంలో కనిపించడం లేదని, వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరాడు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

కథలాపూర్, నవంబర్ 25 : పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయని మండలలోని వైద్యాధికారి సింధూజ పేర్కొన్నారు. సోమవారం కథలాపూర్‌లో కేజీబీవీ హాస్టలన్‌ను పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది పరిశీలించారు. అనంతరం విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 45 మందికి చికిత్సలందించి మందులు పంపిణీ చేశామన్నారు. సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్ఎం శిరిషా, ప్రత్యేకాధికారి లావణ్య పాల్గొన్నారు.

రెగ్యులర్ చేయాలి

జగిత్యాల, నవంబర్ 25: 20ఏండ్లుగా వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రాత పరీక్షా లేకుండా రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంల జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంలు ధర్నా నిర్వహించారు. ఇక్కడ సాధుల వసంత, నీరజ, పద్మ, స్వరూప, జ్యోతి, మధులత, ఉమారాణి, సుప్రియ, ఉజ్వల, శారదా, మేరీ, ఎలిజబెత్, రాజశ్రీ, సునీత, ఇంద్రాణి, సుమలత, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

మారుతీనగర్, నవంబర్ 25 : మెట్‌పల్లి పట్టణ శివ భక్త మార్కండేయ ఆలయ పునర్నిర్మాణానికి జోగ జగదీశ్వర్ దంపతులు రూ. 25,116 విరాళాన్ని సోమవారం వారి స్వగృహంలో పద్మశాలీ పట్టణాధ్యక్షుడు ద్యావనపల్లి రాజారాంకి అందజేశారు. ఈ పద్మశాలీ సంఘ ఉపాధ్యక్షుడు సంకు ఆనంద్, అన్నం నాగరాజు, కోశాధికారి బేతు భాస్కర్, ప్రచార కార్యదర్శి ద్యావనపల్లి గణేశ్, పిన్నంశెట్టి గంగాధర్, శ్యామ్, సంఘ సభ్యులున్నారు.

వృద్ధులు ధైర్యాన్ని కోల్పోవద్దు

కోరుట్ల, నవంబర్ 25 : వృద్ధులు ధైర్యాన్ని కోల్పోవద్దని, సమస్యలు ఎదురైతే వృద్ధుల సంఘాన్ని ఆశ్రయించాలని పట్టణ వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం ఆధ్వర్యంలో పేద వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు దేవయ్య, నాయకులు శ్రీనివాస్, భూమయ్య, భూమేశ్వర్, గంగాధర్, అశోక్, విశ్వనాథం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

ధర్మపురి, నవంబర్ 25: మగ్గిడి (గొల్లపెల్లి) గురుకుల పాఠశాల విద్యార్థి హర్షిత్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ గోనె రమేశ్ తెలిపారు. ఈ నెల 20న మెట్‌పల్లిలో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అండర్-10 విభాగంలో 300 మీటర్ల పరుగులో పోటీలో హర్షిత్ పాల్గొని బంగారు పథకం సాధించడంతో పాటు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, పీఈటీలు అభినందించారు..

కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది

విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఐ రవికిరణ్

పెగడపల్లి, నవంబర్ 25 : కరాటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని ఎస్సై రవికిరణ్ సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక వైష్ణవీ హైస్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్‌లో ప్రతిభ చూపి పతకాలు సాధించారు. కాగా, సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు, క్రీడలు, ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా ఆడ పిల్లలకు తప్పనిసరని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, హెచ్ఎం స్వామి, కరాటే మాస్టర్ రాజశేఖర్, పీఈటీ కార్తీక్ తదితరులున్నారు.

చెక్కుల పంపిణీ

కొడిమ్యాల, నవంబర్ 25 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండల కేంద్రంలోని పంచాయతీలో పంపిణీ చేశారు. మండలంలోని డబ్బుతిమ్మాయిపల్లికి చెందిన ఆదరవేణి రవి, నాచుపల్లి గ్రామానికి చెందిన కే శ్రీకాంత్ గల్ఫ్‌లో మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులకు ప్రమాద బీమాలో భాగంగా రూ. 5 లక్షల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం